

స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

# వైభవంగా యాదగిరీశుడి తిరుకల్యాణం

- అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట, నవంబర్ 29 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. గంటన్నర పాటు అర్చక బృందం శాస్త్రోక్తంగా జరిపారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శ ఆళ్వారులను కొలుసూ హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. లక్ష్మీసమేతుడైన కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్టించి కల్యాణతంతును జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నారసింహుడిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామివారికి నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ వైభవంగా జరిపారు. రాత్రి ప్రధానాలయ ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అనుబంధ రామలింగేశ్వరాలయంలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కొండకింద వ్రత మండపంలో దంపతులు పాల్గొన్నారు. సుమారు 13వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖజానాకు రూ.20,10,595 ఆదాయం సమకూరిందని ఈఓ గీత, అనువంశికధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు.



నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

## కాంగ్రెస్ నాయకుడి వద్ద రూ.4.95లక్షలు పట్టివేత

హాలియా, నవంబర్ 29: నాగార్జునసాగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్యం, డబ్బును విచ్చలవిడిగా పంపిణీ చేస్తున్నారు. అనుముల మండలం మదారిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడి కారులో బుధవారం 4,95,000 రూపాయలను పోలీసులు పట్టుకున్నారు. అనుముల మండలం మదారిగూడెంలో ఓటర్లను ప్రభావితం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోశం శ్రీనివాస్‌గౌడ్ బుధవారం రాత్రి తన షిఫ్ట్ కారులో డబ్బు తరలిస్తుండగా హాలియా ఎస్ఐ శోభన్‌బాబు పట్టుకున్నారు. కారుతోపాటు డబ్బును సీజ్ చేసి కేసు నమోదు చేశారు.



కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ వద్ద పోలీసులు సీజ్ చేసిన డబ్బు, కారు

# ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు 308
- మొత్తం ఓటర్లు 2,51,622 మంది
- 1,27,181 మంది పురుషులు
- 1,24,421 మంది మహిళలు
- ఎన్నికల సామగ్రితో తరలివెళ్లిన సిబ్బంది



దేవరకొండలో ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్న ఎన్నికల అధికారులు

దేవరకొండ, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికలకు ప్రచార పర్వం ముగియడంతో గురువారం పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల డ్యూటీ చేసే అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల్లో తరలించారు. దేవరకొండ నియోజకవర్గంలో 8 మండలాలు ఉండగా 308 పోలింగ్ కేంద్రాలున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,51,622 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,27,181 మంది పురుషులు కాగా, 1,24,421మంది మహిళలు, 16 మంది ఇతరులున్నారు. ఎన్నికల సాయంత్రానికల్లా పో లింగ్ కేంద్రాలకు చేరుకొని ఏర్పాట్లు చేసుకున్నారు.

### బందోబస్తుకు 800 మంది పోలీసులు

ఎన్నికల్లో భాగంగా 800 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం నియమించినట్లు డీఎస్పీ గిరిబాబు తెలిపారు. నియోజకవర్గంలో 308 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రతి పోలింగ్ కేంద్రాలకు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ పోలింగ్ కేంద్రాలకు అదనపు భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూట్‌ల వారీగా పోలీస్ రూట్ అధికారులను నియమించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామన్నారు.

### ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

దేవరకొండ నియోజకవర్గంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ పరిశీలించారు. బుధవారం ఎన్నికల సామగ్రి కేంద్రంలో సామగ్రి, డ్యూటీకి వచ్చే అధికారు హాజరు వివరాలను రిటర్నింగ్ అధికారి శ్రీరాములును అడిగి తెలుసుకున్నారు. ఎన్నిక ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

### అధికారుల కేటాయింపు

308 పోలింగ్ కేంద్రాలకు 357 పోలింగ్ ఆఫీసర్లు, 357 అదనపు పోలింగ్ ఆఫీసర్లు, 700 మంది అదనపు పోలింగ్ అధికారులను ఎన్నికల విధులకు కేటాయించినట్లు ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి శ్రీరాములు తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన సిబ్బంది కాకుండా అదనంగా కొంత మందిని రిజర్వులో ఉంచినట్లు ఆయన చెప్పారు. ఎక్కడైన ఎన్నికల సిబ్బంది తక్కువగా ఉన్నట్లయితే వెంటనే రిజర్వులో ఉన్నవారిని కేటాయిస్తామని ఆయన చెప్పారు.



మాల్‌లో ఎన్నికల సామగ్రితో తరలివెళ్తున్న సిబ్బంది

### ప్రజా ప్రతినిధులు సహకరించాలి

చందంపేట : ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులకు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు సహకరించాలని తహసీల్దార్ రాములు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 43 బూత్‌లో సుమారు 200 మంది ఎన్నికల అధికారులను కేటాయించడం జరిగిందన్నారు. ప్రతి బూత్‌లో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు స్థానిక బీఎల్ఓ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పోలింగ్ బూత్‌లలో ఓటరు శాతం పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



దేవరకొండలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో సామగ్రిని తీసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

**దేవరకొండ నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు**

| మండలం | పురుషులు | మహిళలు | అదనపు | మొత్తం |
|---|---|---|---|---|
| దేవరకొండ పట్టణం | 11,066 | 20,902 | 00 | 55,989 |
| దేవరకొండ మండలం | 16,837 | 16,500 | 01 | |
| చింతపల్లి | 21,160 | 20,902 | 02 | 42,064 |
| కొండమల్లేపల్లి | 14,115 | 13,440 | 03 | 27,558 |
| పీఏపల్లి | 19,167 | 18,970 | 04 | 38,141 |
| చందంపేట | 15,252 | 14,181 | 01 | 29,434 |
| గుండ్లపల్లి | 19,672 | 19,473 | 01 | 39,146 |
| నేరేడుగొమ్ము | 9,912 | 9,374 | 04 | 19,290 |
| మొత్తం ఓటర్లు | 1,27,181 | 1,24,421 | 16 | 2,51,622 |



ఎన్నికల సిబ్బంది వెళ్లేందుకు సిద్ధంగా ఆర్టీసీ బస్సులు